సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 27 । జూన్ । 2023



బ్యూటీషియన్ల మెరుపులు

ఇంటర్నేషనల్ బ్యుటీషియన్ డే సందర్భంగా ఓ హోటల్‌లో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. 8లో



గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధం

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ స్వచ్ఛంధ సంస్థలను కోరారు. 8లో

'సిరి' సిత్రాలు చూడరో..



తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను అలవోకగా తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. 8లో

న్యూస్‌రీల్

28న సీఎం ట్రాన్సిట్ హాల్ట్



మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈనెల 28న విశాఖ వస్తున్నారు. ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 9.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి ఉదయం 9.25 గంటలకు హెలికాప్టర్‌లో పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తారు. అక్కడ అమ్మఒడి నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 1.35 గంటలకు తిరిగి విశాఖ చేరుకుంటారు. 1.45 గంటలకు ప్రత్యేక విమానంలో తిరిగి గన్నవరం వెళ్తారు.

నేడు సింహగిరిపై వరదపాయసం సేవ



వైకుంఠవాసుడు

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టుపై మంగళవారం వరదపాయసం సేవ నిర్వహించనునానరు. వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ నిర్వహించనున్నారు. ఉదయం స్వామి సన్నిధిలో విశేష పూజలు, పంచకలశ స్నపనం నిర్వహిస్తారు. స్వామి సన్నిధిలోనే పాయసం వండి ఆరగింపు చేస్తారు. అనంతరం జారుడుబల్ల ఆకారంలో ఉండే కొండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తారు.

పరశురామావతారంలో జగన్నాథుడు



బలభద్రుడు, సుభద్ర సమేత జగన్నాథుడు

డాబాగార్డెన్స్: జగన్నాథుడి రథోత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీ వద్ద కొలువుదీరిన స్వామి సోమవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు, పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సంగీత జనకులం భజన మండలిచే విష్ణు సహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా నిర్వహించారు. తమ్మిన సిస్టర్స్‌చే శాస్త్రీయ సంగీత గాత్రకచేరి, సాయంత్రం 7.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు కంచరపాలెంకు చెందిన దుర్గాప్రసాద్‌చే శ్రీవారి భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. మంగళవారం స్వామి రామావతారంలో దర్శనమివ్వనున్నారని ఈవో రాజగోపాలరెడ్డి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్

దొండపర్తి: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. సోమవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, ఏ.వి.వి.సూర్యప్రతాప్, సీజీఎం అచ్చి రవి కుమార్, ఏపీ యాంటీ డ్రగ్స్ అండ్ యాంటీ ఆల్కాహాల్ క్యాంపెయిన్ కన్వీనర్ సురేష్ బేత, డాక్టర్ సంతోష్, లిఖిత్ బేత పాల్గొన్నారు.

బెంగళూరు వీక్లీ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-బెంగళూరు-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ మరి కొంతకాలం పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖలో ప్రతీ ఆదివారం బయల్దేరే విశాఖపట్నం-బెంగుళూరు(08543) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జూలై 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతీ సోమవారం బెంగళూరులో బయల్దేరే బెంగళూరు -విశాఖపట్నం (08544) వీక్లీ స్పెషల్ జూలై 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీకి హ్యాపీ సమ్మర్!

- వేసవిలో పెరిగిన ఆక్యుపెన్సీ
- 67 శాతానికి పైగా ఓఆర్ నమోదు
- విశాఖ రీజియన్‌కు రూ.83.50 కోట్ల ఆదాయం
- ఈసారి ఏసీ సర్వీసులకు ఎనలేని డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: ఈ వేసవి మలమల మాడించింది. తీవ్ర వడగాడ్పులతో దడ పుట్టించింది. అయితే ఆర్టీసీకి మాత్రం ఆనందాన్నిచ్చింది. ఆశించిన స్థాయికంటే అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. సాధారణంగా ఎండాకాలంలో పెళ్లిళ్లు, ఇతర శుభ ముహూర్తాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు వంటి విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇతర ప్రాంతాలకు, విహార యాత్రలకు వెళ్తుంటారు. వీటన్నిటితో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య ఇతర రోజుల్లోకంటే వేసవిలో అధికంగా ఉంటుంది. అందుకనుగుణంగానే ఈ సీజనులోనూ ప్రయాణికుల తాకిడి బాగుంది. ఆర్టీసీ విశాఖ జిల్లాలో ఏప్రిల్‌కు ముందు బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 55 శాతం వరకు ఉండేది. ఏప్రిల్ నుంచి ఓఆర్ పెరుగుతూ వచ్చింది. ఏప్రిల్‌లో 55 శాతం, మేలో 67, జూన్‌లో (26వ తేదీ వరకు) 68 శాతం చొప్పున ఓఆర్ నమోదైంది. మరోవైపు సాధారణ నాన్-ఏసీ బస్సులకంటే ఏసీ సర్వీసుల్లో ఓఆర్ మరింత అధికంగా ఉంది. 40–45 డిగ్రీల ఉష్ణోగ్రతల వేసవి తాపం, తీవ్ర వడగాడ్పులకు తాళలేక దూరప్రాంతాలకు వెళ్లే పలువురు ప్రయాణికులు ఏసీ బస్సుల్లో ప్రయాణానికి బాగా మొగ్గు చూపారు. దీంతో ఈ బస్సుల్లో 83 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది. ఏప్రిల్‌లో నెలలో ఇది 50 శాతానికి మించలేదు. ఇలా ఓఆర్‌తో పాటు ఆర్టీసీకి రాబడి కూడా పెరిగింది. విశాఖపట్నం నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ రోజుకు 30 ఏసీ బస్సులను నడుపుతోంది. వీటిలో హైదరాబాద్‌కు ఆరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళంలకు 16, విజయవాడ, కడప, అమలాపురంలకు ఎనిమిది బస్సుల చొప్పున నడుస్తున్నాయి. ఇవన్నీ 80 శాతానికి పైగా ఓఆర్ సాధించాయి. ఏప్రిల్ నెలలో రూ.25.50 కోట్లు, మే నెల రూ.32 కోట్లు, జూన్‌లో ఇప్పటివరకు రూ.26 కోట్లు వెరసి ఈ వేసవి మూడు నెలల్లో రూ.83.50 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది ఆర్టీసీకి ఊరటనిచ్చే అంశమని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

వచ్చే ఏడాదికి వైద్య కళాశాల సిద్ధం

- చురుగ్గా పాడేరు వైద్య కళాశాల నిర్మాణ పనులు
- పలు బ్లాకులు తనిఖీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మెడికల్ కళాశాల భవన నిర్మాణాల నమునాను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

సాక్షి, పాడేరు: గిరిజనులకు ఉన్నత వైద్యం, విద్య లక్ష్యంతో పాడేరులో రూ.500 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాలలో వచ్చే ఏడాది నుంచి తరగతులను ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పలు బ్లాక్‌ల భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆయా పనుల ప్రగతిపై అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. వైద్య కళాశాల నమూనాను అధికారులు మంత్రికి చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పాడేరుతో పాటు మరో నాలుగు జిల్లాల్లోని వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాలకు వైద్య నిపుణులు, ఆధునిక వసతులు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షల అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ భరత్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సత్కారం



క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్, డైరెక్టర్లు

ఉక్కునగరం: భారత్ క్రికెట్ ఆటగాడు కె.ఎస్.భరత్‌ను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సత్కరించింది. సోమవారం ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో భరత్‌కు సీఎండీ అతుల్ భట్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తన కృషి, పట్టుదలతో భరత్ భారత్ టెస్ట్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఆయన టెస్ట్ క్రికెట్ కెరీర్ సుదీర్ఘ కాలం కొనసాగగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భరత్ మాట్లాడుతూ విశాఖలో ఉండే తాను అప్పుడప్పుడు ఉక్కు స్టేడియంలో ప్రాక్టీస్ చేసేవాడినన్నారు. ఉక్కు స్టేడియంలోని మంచి బౌన్స్ కలిగిన పిచ్ తన ప్రాక్టీసుకు ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా భరత్ కోచ్ జె.కృష్ణారావును, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గేమ్ డెవలప్‌మెంట్ జీఎంగా నియమితులైన స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం మాజీ జీఎం ఎం.ఎస్.కృష్ణారావులను సత్కరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు, స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 2న యూపీఎస్సీ నిర్వహించనున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొవిడెంట్ ఫండ్ కమిషనర్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 11,520 మంది అభ్యర్థులు హాజరు కానుండగా 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయ లేకుండా చూడాలని, విద్యార్థుల కోసం తగినన్ని ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

1 నాటికి కేజీబీవీల్లో ఉపాధ్యాయుల భర్తీ

సమగ్ర శిక్ష పీడీ శ్రీనివాసరావు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

తగరపువలస: కేజీబీవీల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ పూర్తి చేసి జూలై ఒకటి నాటికి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన భీమిలిలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, డైట్, బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. కేజీబీవీలలో అన్ని వసతులు సకాలంలో అందుతున్నాయా..? లేదా..? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా గణితంలో సామర్థ్యాలను పరీక్షించారు. నాడు – నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుకలు సరిపడా అందించాలన్నారు. వీటి సరఫరాపై తల్లిదండ్రులకు ఫోన్ చేసి అభిప్రాయాలు తీసుకున్నారు. బూట్లు సైజు సరిపోకపోతే మండల, జిల్లా స్థాయిలో మేళాలు నిర్వహించి సర్దుబాటు చేయాలన్నారు. ఆయనవెంట డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్, ఆర్జేడీ జ్యోతికుమారి, సర్వశిక్ష అభియాన్ ఈఈ డీవీ నరసింహారావు, ఏఈ మహాలక్ష్మి, అకడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మి, సీఎంవో శిరీష, ట్రైనీ కన్సల్టెంట్ సోనాలీసింగ్, ఏపీవో అప్పలనాయుడు ఉన్నారు.

యువ న్యాయవాదులకు చేదోడు

- వైఎస్సార్ 'లా' నేస్తం నిధుల విడుదల
- జిల్లాలో 601 మందికి లబ్ధి



యువ న్యాయవాదులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

మహారాణిపేట : కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్లపాటు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తోంది. ఏడాదికి రూ.60 వేల చొప్పున రెండు విడతల్లో వారి ఖాతాల్లో జమ చేస్తోంది. మూడేళ్లలో ఒక్కో న్యాయవాదికి మొత్తం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి–జూన్ మధ్య ఐదు నెలల కాలానికి జిల్లాలో అర్హులైన 601 మంది యువ న్యాయవాదులకు రూ.5 వేలు చొప్పున స్టైఫండ్ అందించింది.

సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి 2023–24 సంవత్సరానికి మొదటి విడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో అర్హులైన 601 మంది యువ న్యాయవాదులకు రూ.30,05,000 మొత్తాన్ని మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. యువ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడేందుకు లా నేస్తం దోహదం పడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమదేవి, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎంకు ధన్యవాదాలు



గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బి.ఎల్ చదివాను. ఏడాది నుంచి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న. వైఎస్సార్ 'లా' నేస్తం సహాయం నాకు ఎంతగానో ఉపయోగపడింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– కె.అమల, న్యాయవాది

ఎంతో ఉపయోగకరం



నేను ఎంతో కష్టపడి చదువుకున్నాను. ఇప్పుడు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. నా తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా ఈ పథకం ఎంతగానో మేలు చేస్తుంది. ఈ పథకం మాలాంటి యువన్యాయవాదులకు ఎంతో ఉపయోగకరం.

– టి.సాయి ప్రియాంక, న్యాయవాది

ఆనందంగా ఉంది



ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ 'లా' నేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారు. న్యాయవాది చదువు పూర్తి చేసి ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో డబ్బులు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– బి.గౌతమ్, న్యాయవాది

ముగ్గురు సచివాలయ ఉద్యోగులపై వేటు

మహారాణిపేట : ఓటర్ల జాబితా పరిశీలన విషయంలో విధులు సక్రమంగా నిర్వర్తించని ముగ్గురు సిబ్బందిపై వేటు పడింది. ఓటర్లు ఊళ్లకు వెళ్లగా ఇంట్లో లేరన్న కారణంగా వారిని జాబితా నుంచి తొలగించడం పట్ల ఎన్నికల కమిషన్ అగ్రహం వ్యక్తం చేసింది. వారి ఆదేశాలతో కలెక్టర్ మల్లికార్జున బూత్ లెవల్ ఆఫీసర్లు అయిన సచివాలయ ఉద్యోగులు మఱ్రి చిన్నయ్య, బి.రాధ, కె.హేమంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు మూడు బూత్‌లలో విధులు సక్రమంగా నిర్వర్తించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల స్వీకరణ

గోపాలపట్నం: విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి తెలిపారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బయోలజీ, సోషల్ సబ్జెక్టుల బోధనకు గాను అభ్యర్థులు ఈ నెల 28న 9 గంటలకు కొమ్మాదిలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో నిర్వహించే డెమోకి హాజరుకావాలని కోరారు. వివరాలకు 0891-2799641 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

'జగనన్న విదేశీ విద్య'కు 12 మంది ఎంపిక

- ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 98 దరఖాస్తులు

ఎంవీపీ కాలనీ: జగనన్న విదేశీ విద్యా దీవెనకు 12 మంది విద్యార్థులు అర్హత సాధించారు. గత నెలలో ప్రభుత్వం విదేశీ విద్యా దీవెన మంజూరుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీంతో ఎంవీపీ కాలనీలోని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 98 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన అనంతరం రూ.8 లక్షల కుటుంబ వార్షిక ఆదాయం, క్వాలిఫైయింగ్ కోర్సులో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ పాయింట్స్, ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకొనే ఇంటర్మీడియేట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత తప్పనిసరి వంటి విషయాలను పరిగణలోకి తీసుకొని 12 మందితో కూడిన అర్హుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. త్వరలో ప్రభుత్వం అర్హుల జాబితాను విడుదల చేయనుండగా ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు అంతర్జాతీయంగా టాప్ 50 విద్యా సంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సుల్లో చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించనుంది.

వినతులు శత శాతం పరిష్కరించాలి

- జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ మల్లికార్జున



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే వినతులన్నీ పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 238 అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి అందే వినతులను అదేరోజు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతీవారం కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తామని, ఎక్కడా పెండింగ్ ఉండకూడదని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అధికారులంతా సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు.

ఇంజినీరింగ్ అధికారులపై అసంతృప్తి

గడపగడపకు మన ప్రభుత్వం పనుల్లో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పనుల్లో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణాలను వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత అంశాల వారీగా తక్షణమే టెండర్లు పిలిచి పనులను తక్షణం పూర్తి చేయాలని జీవీఎంసీ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పనులు ప్రారంభమై పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. హౌసింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

జగనన్న సురక్షకు అధికారులు సిద్ధంగా ఉండాలి

జగనన్న సురక్షకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. జగనన్న సురక్ష అమలుపై అన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. జగనన్న సురక్ష క్యాంపులను పరిశీలించి, క్రమం తప్పకుండా కలెక్టర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. సంబంధిత సెక్రటేరియట్‌ల్లో క్యాంపు షెడ్యూల్ తేదీకి 7 రోజుల ముందు కార్యకలాపాలు – అవగాహన ప్రచారాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 86 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ మేయర్‌కు 14 వినతులు..ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 86 అర్జీలు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఫోన్‌లో ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో స్వీకరించిన వినతులు, ఆయా విభాగాధిపతులు చేపట్టిన పరిష్కార చర్యలకు సంబంధించి అంశాలను వచ్చే సోమవారం నిర్వహించే కార్యక్రమంలో నివేదిక ఇవ్వాలన్నారు. దీంతో నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కరించామో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్‌కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 56 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ఈ ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బ్యాగుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న సరుకుల పంపిణీకి వినియోగించే బ్యాగ్‌ల సరఫరాకు జిల్లా కొనుగోళ్ల కమిటీ టెండర్ దరఖాస్తులను ఆహ్వానించింది. 17,100 బ్యాగుల సరఫరా చేయాల్సి వుంటుంది. ఆసక్తిగల వారు జిల్లా స్త్రీ ,శిశు సంక్షేమం, సాధికార అధికారి కార్యాలయంలో వారి టెండర్ దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నంలో పు అందజేయాలి. అనంతరం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆ టెండర్లును తెరిచి గుత్తేదారుడ్ని ఖరారు చేయనున్నట్లు తెలిపింది.

1న వీజేఎఫ్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: వైజాగ్ జర్నలిస్టు ఫోరం (వీజేఎఫ్) సర్వసభ్య సమావేశం జులై ఒకటో తేదీన ఏర్పాటు చేయాలని ఐదుగురు సభ్యుల కమిటీని జిల్లా కలెక్టర్ ఆదేశించారని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ తెలిపారు. సోమవారం వీజేఎఫ్ సభ్యుల జాబితాను అధికారుల కమిటీ ప్రకటించిందన్నారు. గతంలో ప్రకటించిన సభ్యుల జాబితాలో అభ్యంతరాలు/దరఖాస్తులు పరిశీలించిన అనంతరం నూతన జాబితా ప్రకటించామన్నారు. సర్వసభ్య సమావేశం వేదిక, సమయం త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంనాడే ఎన్నికల అధికారిని ప్రకటించడంతోపాటు ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల చేస్తామని డీఐజీ బాలకృష్ణ పేర్కొన్నారు.

వైఎస్సార్ కప్ బాక్సింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ



వైఎస్సార్ కప్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మహారాణిపేట: మారుతి బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు వంకాయల మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో పదేళ్లుగా నిర్వహిస్తున్న వైఎస్సార్ కప్ 2023 బాక్సింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్ ట్రోఫీని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీతమ్మధారలోని క్యాంప్ ఆఫీసులో సోమవా రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపించాలన్నారు. మారుతి బా క్సింగ్ క్లబ్ ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం శుభ పరిణామమని అన్నారు. ఈ పోటీలు జూలై 7,8,9, తేదీలలో మధురవాడ చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అప్పలరెడ్డి, క్రీడాకారులు పల్లి రామకృష్ణారెడ్డి, పిళ్ల సత్యనారాయణ, బంగారు ప్రకాష్, పసుపులేటి గోపి, బైపిల్లి ప్రసాద్, సుధీర్, సాయి ప్రసాద్, తైక్వాండో కోచ్ బసనబోయిన ఆనంద్ పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా, శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడ మీద ఉన్న సంస్థ కార్యాలయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రోజూ ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల గృహిణులు ఇనిస్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999 ఫోన్ నంబరుకు సంప్రదించాలన్నారు.

'సిరి' సిత్రాలు చూడరో..

చిత్రకళలో అతనొక ప్రత్యేకం. అందరూ రంగులు వాడితే ఆయన రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తారు.. వీటితోనే అద్భుత చిత్రాలకు జీవం పోస్తున్నారు. ఏ రంగంలోనైనా ప్రత్యేకత చాటుకోకపోతే ఉనికి ఉండదు. అందుకే మోకా విజయ్ కుమార్ తనకంటూ ఓ బ్రాండ్ సృష్టించుకున్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల మనసు దోచుకున్నారు. హైదరాబాద్‌లో జీ 20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయకుమార్ విశాఖకు చేరుకున్నారు. ఆయన కళానైపుణ్యంపై ప్రత్యేక కథనం.. –ఏయూక్యాంపస్

- తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలు
- విదేశాలకు విశాఖ చిత్రకారుడి విజయ్ కుమార్ ప్రతిభ
- ఇప్పటి వరకు చిరుధాన్యాలతో 60 చిత్రాల రూపకల్పన



తాను తీర్చిదిద్దిన తృణధాన్యాల చిత్రాలతో విజయ్ కుమార్

తృణధాన్యాలతో ప్రముఖుల చిత్రాలను అలవోకగా తీర్చిదిద్దుతున్నారు విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. ఈ సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాలకు అంతటి ప్రాముఖ్యత లభిస్తోంది. దీనిని సాధనంగా చేసుకుని, చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తన ప్రతిభకు కొత్తదనాన్ని జోడించారు. సమాజంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించే విధంగా తన కళకు కాస్త కొత్తదనాన్ని జోడించారు. నేడు జాతీయ స్థాయిలో విజయ్‌కుమార్ తీర్చిదిద్దిన చిత్రాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన జీ 20 సదస్సులో భాగంగా 38 దేశాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రుల చిత్రపటాలను తయారు చేసి మంత్రులకు, వారి అధికారులకు బహూకరించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు సైతం ఆయన చిత్రపటాన్ని సిరిధాన్యాలతో తయారు చేసి విజయ్ కుమార్ స్వయంగా బహూకరించారు. హైదరాబాద్‌లో జీ20 సదస్సులో అతిథులకు చిత్రాలు బహూకరించిన అనంతరం విజయకుమార్ విశాఖ చేరుకున్నారు.

రైల్వేలో ఉద్యోగం చేస్తూ..

విజయ్ కుమార్ రైల్వేలో గ్రేడ్ 1 ఉద్యోగిగా పనిచేస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తి చిత్రకారుడిగా మార్చింది. రెండున్నర దశాబ్దాలుగా రైల్వేలో పనిచేస్తూనే చిత్రకళపై ఆసక్తి ఉన్న చిన్నారులకు సైతం శిక్షణ ఇస్తున్నారు. పెన్సిల్, కలర్ ఆర్ట్ వేయడంలో విజయ్ కుమార్ నిష్ణాతుడు.

అంతర్జాతీయ స్థాయికి భారతీయ కళ

భారతీయ కళావైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీసుకువెళ్లిన విజయ్ కుమార్ ఇప్పటి వరకు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల చిత్రపటాలను కేవలం చిరుధాన్యాలను ఉపయోగించి, ఎటువంటి రంగులు వాడకుండా తయారు చేయడం విశేషం. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని చిత్రపటాలను సైతం వీటిలో ఉన్నాయి.

ఒక్కో చిత్రానికి నాలుగు రోజులు

ఒక్కో చిత్రానికి దాదాపు నాలుగు రోజులు పడుతుంది. ప్రధానంగా రాగులు, అరికలు, సజ్జలు, గంట్లు, సామలు వినియోగిస్తున్నారు. జర్మనీలో తయారయ్యే కాన్సన్ వాటర్ కలర్ షీట్‌పై ముందుగా పెన్సిల్‌తో అవసరమైన చిత్రానికి అవుట్‌లైన్ గీసుకుంటారు. అనంతరం దీనిపై ఫొటోకు అవసరమైన విధంగా సజ్జలు, రాగులు, అరికలు, సామలు, గంట్లు వంటి సిరిధాన్యాలను ఎంతో జాగ్రత్తగా అతికిస్తూ చిత్రాన్ని తీర్చిదిద్దుతారు. అనంతరం పెస్ట్ కంట్రోల్ చేసి, గాలి చొరబడకుండా ప్రత్యేకంగా ఫ్రేమ్ కట్టిస్తారు.



కేంద్ర ఆహార మంత్రి తోమర్‌కు తృణధాన్యాల చిత్రపటం అందిస్తున్న విజయ్ కుమార్ (ఫైల్)

జీ–20 సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా..

విశాఖ వేదికగా జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సైతం ప్రముఖుల చిత్రాలను సిరిధాన్యాలతో తయారు చేసి బహూకరించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (హైదరాబాద్) నిపుణులు ఈ చిత్రాలను పరిశీలించి, విజయ్ కుమార్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సిరిధాన్యాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా విజయ్ కుమార్ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. తృణధాన్యాలతో వందకు పైగా చిత్రాలను తయారు చేసి గిన్నిస్‌రికార్డు సాధించడమే లక్ష్యమని విజయ్ కుమార్ తెలిపారు.

'జ్యూట్ యాజమాన్యంపై కేసు వేస్తాం'

తగరపువలస: అర్హత కలిగిన చిట్టివలస జ్యూట్‌మిల్లు బదిలీ కార్మికులందరికీ వారి సర్వీస్ గ్రాడ్యుటీ చెల్లింపులకు జిల్లా లేబర్‌కోర్టులో సివిల్ కేసు దాఖలు చేయనున్నట్టు మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ప్రకటించింది. సోమవారం సాయంత్రం సంతోపేటలో సమావేశమైన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తాము యాజమాన్యంపై వేసిన కేసులకు సంబంధించి ఈ నెల 15న యజమాని కేకే బజోరియాకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిందన్నారు. దీంతో ఆయన కోర్టుకు రాత పూర్వకంగా వాంగ్మూలం ఇస్తూ 2012లోనే మిల్లుకు సంబంధించిన ఆస్తుల నుంచి తప్పుకున్నట్టు లేబర్‌కోర్టుకు తెలిపారన్నారు. ప్రస్తుతం మిల్లు ఆస్తులను లలిత్ మోహన్ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో తుది విచారణ జరిగే జూలై 10న 3వ ప్రతినిధిగా జాయింట్ లేబర్ కమిషనర్, 5వ ప్రతినిధిగా లలిత్ మోహన్ హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. యాజమాన్యం తప్పుడు లెక్కల కారణంగా అయిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కార్మికులకు గ్రాడ్యుటీ తగ్గిందన్నారు. వీరికి పూర్తిగా గ్రాడ్యుటీ చెల్లింపునకు ఈఎస్ఐ కార్డు, వేతన స్లిప్, ఆధార్‌కార్డులతో సంతపేటలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్ర' సంబరాలపై సమీక్ష



పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించనుందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు. కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిర్ణయించిందని పేర్కొన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలను ప్రధానంగా ఆడించనున్నారని తెలిపారు. వీటితోపాటు మారథాన్, యోగా, టెన్నీకాయిట్, ఇతర సంప్రదాయ ఆటల పోటీలను కూడా ప్రభుత్వం నిర్వహించనుందన్నారు . సచివాలయాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 46 రోజుల పాటు ఈ క్రీడలు జరుగుతాయన్నారు. 17 ఏళ్లు పైబడి ఆసక్తిగల యువతి, యువకులు, క్రీడాకారులు వారి పరిధిలో ఉన్న సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని డీఎల్ డీవోని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సెట్విస్ సీఈవో సుబ్బిరెడ్డి , డీఎల్ డీవో పూర్ణిమ దేవి, చీఫ్ కోచ్ జూన్ గాలియట్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హంతకునికి జీవిత ఖైదు

విశాఖ లీగల్: స్నేహితుడిని హత్య చేసిన నేరానికి ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్ములో రూ.15 వేలు బాధితురాలికి ఇవ్వాలని పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎం.దాలినాయుడు (30) విశాఖ జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన వాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఫిర్యాది ఎస్.రమాదేవి రాంబిల్లి మండలానికి చెందిన అప్పన్నపాలెం గ్రామ నివాసి. రమాదేవి భర్త రామనాయుడు విశాఖ డెయిరీలోని పశు సంవర్ధక విభాగంలో పనిచేసేవాడు. దాలి నాయుడు, రామనాయుడు మంచి స్నేహితులు కావడంతో వీరు తరచూ కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో రామనాయుడు భార్య రమాదేవితో దాలినాయుడు మాట్లాడడంతో స్నేహితుల మధ్య వివాదం చెలరేగి హత్యకు దారి తీసింది. 2016 డిసెంబరు 2న రామనాయుడు విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా రాత్రి 10:30 సమయంలో దాలి నాయుడు ఘర్షణ పడ్డాడు. ఇదే అదునుగా దాలి నాయుడు ముందుగా తనతో తెచ్చుకున్న కత్తితో బలంగా గాయపరిచాడు. కొంతసేపు ప్రాణంతో ఉన్న రామనాయుడు తన ఇంటి వద్దకు రాగానే మృతి చెందాడు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు దేవరపల్లి పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రం దాఖలు చేశారు. అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళి కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

పోలీస్ స్టేషన్ సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



ట్రైనీ ఐపీఎస్‌లతో మాట్లాడుతున్న ఏసీపీ నరసింహమూర్తి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ట్రైనీ ఐపీఎస్‌లు సోమవారం సందర్శించారు. ట్రైనింగ్‌లో భాగంగా స్టేషన్‌లో పనితీరు తెలుసుకున్నారు. రౌడీషీట్ నమోదు, ముద్దాయిల అరెస్ట్, వారి విచారణపై తెలుసుకున్నారు. 41ఏ నోటీస్ విధివిధానాలు, స్టేషన్‌కు సంబంధించిన జనరల్ డైరీ, సిబ్బంది హాజరు వివరాలు తెలుసుకున్నారు. ట్రైనీ ఐపీఎస్‌ల సందేహాలకు వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్. విజయ్‌కుమార్ జవాబులిచ్చారు.

9 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో జూలై 9 నుంచి వార్షిక బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరగనున్న పోటీల్లో ఆయా కేటగిరిల్లో విజేతలుగా నిలిచిన వారిని జిల్లా జట్టుగా ఎంపిక చేయనున్నారు. అండర్ 11 నుంచి 19 వరకు ఐదు కేటగిరిల్లో బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనేవారు నిర్ణీత ప్రవేశరుసుం చెల్లించి ఆరో తేదీలోగా ఎంట్రీలు పంపించాలని నిర్వాహకులు కోరారు.

బ్యూటీషియన్ల మెరుపులు



సందడి చేస్తున్న బ్యూటీషియన్లు



ర్యాంప్ వాక్

ఆరిలోవ: ఇంటర్నేషనల్ బ్యూటీషియన్ డే సందర్భంగా సిరిపురం వద్ద మంత్రిస్ హోటల్‌లో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన నృత్యాలు, కోలాటం, స్కిట్స్ పలువుర్ని అలరించాయి. ఈ సందర్భంగా ఆల్ ప్రొఫెషనల్ బ్యూటీ థర్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ మాట్లాడుతూ కొత్తగా అసోసియేషన్‌లో చేరినవారికి బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అడ్వాన్స్‌డ్ కోర్సులు, సెమినార్, వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శాంతి, కార్యదర్శి లక్ష్మీ మాధవిలత పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధం

డాబాగార్డెన్స్: శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పలు స్వచ్ఛంధ సంస్థలను కోరారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సోమవారం పలు స్వచ్ఛంద సంస్థలు, ఆర్‌డబ్ల్యూఏస్, ఎన్‌జీవోస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నందున గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు అందించే ప్రసాదాలు, పానీయాలు ప్లాస్టిక్ కల్గిన వస్తువుల్లో అందించొద్దన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా 500 మంది వలంటీర్లను, అలాగే స్వచ్ఛంధ సంస్థలు వీలైనంత వరకు ఎక్కువ మంది వలంటీర్లను ఏర్పాటు చేసి గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 14 ఏళ్లలోపు గల పిల్లలకు గిరి ప్రదక్షిణలో తప్పిపోకుండా జీవీఎంసీ టాగ్‌లు ఏర్పాటు చేస్తుందని, ట్యాగ్‌పై తల్లిదండ్రుల పేర్లతో పాటు ఫోన్ నంబర్ రాయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో గంగవరం పోర్టు



గంగవరం పోర్టు వద్ద మోహరించిన పోలీసులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు వద్ద సోమవారం పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. పోర్టులో పని చేస్తున్న కార్మికులు తమ వేతనాలను పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో సుమారు 400 మంది పోలీసులు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు, పోర్టు యాజమాన్య ప్రతినిధులు కార్మికుల వేతనాల సమస్యపై కలెక్టర్‌తో కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం చర్చలు జరగనున్న నేపథ్యంలో గంగవరం పోర్టు ఆవరణలో భారీగా పోలీసులను మోహరించారు. గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులు శనివారం పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 మంది కార్మికులను అదుపులోకి తీసుకోవడం, ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కార్మికులకు మద్దతు ప్రకటించడంతో పోర్టు వద్ద మరోసారి వాతావరణం వేడెక్కే పరిస్థితి నెలకొంది. పోర్టులో పని చేస్తున్న 500 మంది నిర్వాసిత కార్మికులకు సోమవారం సంస్థ సెలవు ప్రకటించడంతో వారంతా ఎక్కడ ఆందోళనకు దిగుతారమోనని ముందుస్తుగా ఇక్కడ పోలీసులను మోహరించారు. వేతనాల పెంపు, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్ నేపథ్యంలో న్యూపోర్టు, స్టీల్‌ప్లాంట్, మల్కాపురం, దువ్వాడ పోలీసులతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసు బలగాలను ఇక్కడ మోహరించారు. దీని కారణంగా గంగవరం పోర్టు ప్రాంతం మొత్తం పోలీసులు నీడలోకి వెళ్లిపోయింది. ఇదిలావుండగా కలెక్టర్‌తో చర్చలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలో గల ఇంటింటికీ వలంటీర్ వెళ్లి ప్రజల అవసరాలు గుర్తించాలన్నారు. అలాగే గతంలో తిరస్కరించిన దరఖాస్తుల్లో అర్హులు ఉంటే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని వివరించారు. సెల్ సిగ్నల్స్ అందుబాటులో లేని ప్రాంతాల్లో వివరాల నమోదు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో పుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తే అర్హులందరికీ మేలు జరుగుతుందని, 90 శాతం సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. అవినీతికి తావు లేకుండా రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా జమ చేసిన జగనన్నలాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరన్నారు. సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చి అందరికీ మేలు చేకూర్చడానికి సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను సీఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకొస్తే... వాటి వల్ల రాష్ట్రం నాశనమవుతుందని, మరో శ్రీలంక అవుతుందని చంద్రబాబు ఎద్దేవా చేశారన్నారు. ప్రస్తుతం వాటికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి బాబు మాయమాటలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రత్నం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు యలమంచిలి సూర్యనారాయణ, బోని అప్పలనాయుడు, ఎంపీడీవో అడపా లవరాజు, తహసీల్దార్ లోకవరపు రామారావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఈవోపీఆర్డీ కరుణాకర్, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, కోరాడ ముసలినాయుడు, పాండ్రంకి అప్పారావు, బొట్టా రామకృష్ణ, గండ్రెడ్డి శ్రీనివాస్, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు, డోల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరం వైఎస్సార్ పశు బీమా



వైఎస్సార్ పశు బీమా పథకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, అధికారులు

మహారాణిపేట: రైతులకు వైఎస్సార్ పశు బీమా పథకం వరమని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో వైఎస్సార్ పశుబీమా పథకం పోస్టర్, కరపత్రాలను సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ఆపత్కాలంలో పశు బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాడి పశువులు, జీవాలు ఆకస్మికంగా చనిపోయినప్పుడు రైతులు నష్టపోతారని, కేవలం 20 శాతం బీమా సొమ్ము చెల్లిస్తే ఆపత్కాలంలో ఆసరా అవుతుందని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డా.రామకృష్ణ మాట్లాడుతూ కేవలం రూ.384 చెల్లిస్తే రూ.30 వేలు..మూడేళ్ల కాలానికి బీమా వర్తిస్తుందన్నారు. ఈ సదుపాయం గొర్రెలు, మేకలు, పందులు పెంపకం దారులకు ఉపయోగపడుతుందన్నారు. దీనికి సంబంధించి సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1962కు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డా.కరుణాకరరావు, సహాయ సంచాలకులు డా.శ్రీనివాస్, డా.శ్రీనుబాబు, డా.మాదిన ప్రసాదరావు, డా.పూర్ణిమ పాల్గొన్నారు.

బొండా కుటుంబానికి మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు వెంకట సంతోష్‌కుమార్ ఈనెల 20న ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతని అవయవాలు జీవన్‌ధాన్‌కు దానం చేసి మరో ఐదుగురు జీవితాల్లో వెలుగు నింపాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌లో మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట రీజనల్ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఎ.రాజబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, బోని శివరామకృష్ణ, చొక్కెర శేఖర్, బొండా శ్రీను, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సభ్యుల షేర్లపై 12 శాతం డివిడెండ్ చెల్లింపు



వివరాలు వెల్లడిస్తున్న వీసీబీ చైర్మన్ చలసాని రాఘువేంద్రరావు

సీతమ్మధార: ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకులో సభ్యులు షేర్లు ధనంపై 12 శాతం డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించినట్లు బ్యాంకు చైర్మన్ చలసాని రాఘువేంద్రరావు తెలిపారు.ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.7,728.43గా నిర్దేశించుకున్నట్టు చెప్పారు. సభ్యులు షేర్ ధనంపై 12 శాతం డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సోమవారం ద్వారకా నగర్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 శాతం డివిడెండ్ చెల్లింపు ద్వారా రూ.33.56 కోట్లు సభ్యుల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. బ్యాంకు సాధించిన లాభాలు, మిగులు నేపథ్యంలో రికార్డు స్థాయిలో డివిడెండ్ చెల్లించడం మంచి పరిణామమన్నారు. ఎమెరిటస్ చైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన చాలా సంస్థలు అలా వ్యవహరించడం లేదని, అదే బాటలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కూడా పనిచేస్తోందన్నారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ గొప్పగా ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, వాస్తవానికి ఆ పరిస్థితి లేదన్నారు. సామాన్య ప్రజలు సేవింగ్స్ తగ్గాయన్నారు. ఎమెరిటస్ చైర్మన్ పదవి విషయంపై ఆయన మాట్లాడుతూ అనవసరంగా ఆర్బీఐ కొన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటోందన్నారు. ఎమెరిటస్ చైర్మన్ పదవి తొలిగింపు అంశం ఆర్బీఐకు సంబంధించినది కాదన్నారు. ఈ విషయంపై ఆర్బీఐకు, బ్యాంకుకు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎమెరిటస్ చైర్మన్ బాధ్యతలు నుంచి స్వచ్ఛంధంగా వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు మానం ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ వైస్‌చైర్మన్ జి.భాస్కర రావు, డైరెక్టర్లు ఏజే స్టాలిన్, కె.భవాని, వి.చంద్రశేఖర్, సీహెచ్ ఆదినారాయణ శాస్త్రి, ఎస్.జానకి రామ చంద్రరాజు, యు.పార్వతీదేవి, పి.నారాయణ స్వామి, ఎ.రామకృష్ణారావు, బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణాధికారి పీవీ నరసింహమూర్తి, బ్యాంకు జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.